సాక్షి
ఒడిశా
శుక్రవారం । 26 । జూలై । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,56,149లు, వెండి 62 గ్రాములు 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వర్షంతో కూలిపోయిన ఇళ్లు

మల్కన్‌గిరి జిల్లాలో రెండు చోట్ల వర్షం ప్రభావంతో ఇళ్లు కూలిపోయాయి.

- 8లో



భారీగా గంజాయి పట్టివేత

గజపతి జిల్లా మోహనా బ్లాక్ భఘమర్రి పంచాయతీ శికులిపదర్ వద్ద ఒక కారులో తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన శిబిరం



చట్టాలపై చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జయపురం: స్థానిక భరణిపుట్ కొలాబ్ ప్రాజెక్టు ఉన్నత పాఠశాలలో కొరాపుట్ జిల్లా న్యాయసేవ ప్రదీకరణ సంస్థ జయపురం శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు సంబంధించిన చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా శిశు కల్యాణ కమిటీ అధ్యక్షురాలు గాయిత్రీ దేవి మాట్లాడుతూ.. పిల్లలకు మెరుగైన రక్షణ, వైద్య చికిత్స, సామాజిక న్యాయం, పునరావాసం, మౌలిక సౌకర్యాల కల్పన తదితర చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవ ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత జడ్జి సుమన్ జెన, పాఠశాల హెచ్‌ఎం పరశురాం శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హిందీ శిక్షణ శిబిరం



చేతిరాత పుస్తకాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

జయపురం: పట్టణంలోని జగదీష్ చంద్ర నాయిక్ ఉన్నత పాఠశాలలో గత పదేళ్లుగా నిర్వహిస్తున్న హిందీ శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. కేంద్రీయ హిందీ సంస్థాన్ భువనేశ్వర్ శాఖ ద్వారా కొరాపుట్ జిల్లా విద్యాధికారి అధ్వర్యంలో ఈ కార్యక్రమంలో ప్రారంభించబడింది. జిల్లాలోని 70 మందికిపైగా హిందీ ఉపాధ్యాయులు శిబిరంలో పాల్గొన్నారు. హిందీ ప్రచారక ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రంజనీ దాస్, సంబల్‌పూర్ మహా విద్యాలయ హిందీ శిక్షకుడు డాక్టర్ లక్ష్మాధర దాస్, హైదరాబాద్ హిందీ శిక్షణ సంస్థానం అధ్యాపకుడు, హిందీ భాష పరిశోధకుడు డాక్టర్ చంద్రప్రతాప్ సింగ్ తదితరులు నూతన హిందీ పాఠ్యక్రమంలో బోధించే విధానాన్ని, వ్యాకరణాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు విద్యాధికారి జగన్నాథ్ పాత్రో, ఒడిశా కేంద్రీయ విశ్వ విద్యాలయ కొరాపుట్ హిందీ చీఫ్ డా.చక్రధర్ ప్రధాన్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉపేంద్ర కుమార్ దీప్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం




నుజ్జునుజ్జు అయిన ద్విచక్ర వాహనం

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితిలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. చిత్రకొండ సమితి గోజియగూడ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై చిత్రకొండ వెళ్తున్నారు. అదే సమయంలో సమితి కార్యాలయానికి సమీపంలో బీఎస్‌ఎఫ్ క్యాంప్‌కు సరుకులు తీసుకెళ్తున్న ట్రక్‌ను ఎదురుగా వచ్చి ఢీకొనడంతో కిందిపడి గాయపడ్డారు. వెంటనే స్థానికుల సాయంతో గాయపడినవారిని చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ బండి నడుపుతున్న రాజేష్ ఖోర (32) మృతి చెందాడు. అతడి వెనుక కూర్చున్న దివ్యలేస్ సగోరి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలియడంతో చిత్రకొండ ఐఐసీ ముఖుందో మేల్కా ఆరోగ్య కేంద్రానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బైక్ అతివేగంగా నడపడమే ప్రమాదానికి కారణమని స్థానికులు పేర్కొంటున్నారు.

నేడు సీఎం ఢిల్లీ పర్యటన

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి శుక్రవారం ఢిల్లీ బయల్దేరనున్నారు. ఈనెల 27న జరగనున్న నీతి అయోగ్ సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో వివిధ అభివృద్ధి అంశాలు, విధానపరమైన అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. నీతి అయోగ్ తొమ్మిదో పాలక మండలి సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షత వహిస్తారు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి వికసిత్ భారత్ @2047 అంశంపై చర్చ సాగుతుందని అనుబంధ వర్గాలు తెలిపాయి. నీతి అయోగ్ అత్యున్నత స్థాయి మండలిలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు మరియు పలువురు కేంద్రమంత్రులు ఉన్నారు. 2015లో ఏర్పాటైన భారత ప్రభుత్వ ప్రధాన విధాన నిర్ణాయక సంస్థ నీతి అయోగ్ కావడం విశేషం.

కొంగొత్త ఆశలతో..!



- రూ.2,65,000 కోట్లతో బీజేపీ ప్రభుత్వ తొలి బడ్జెట్
- మహిళలు, యువతకు పెద్దపీట
- సుభద్ర యోజనకు రూ.10,000 కోట్ల కేటాయింపు
- బడ్జెట్ ప్రవేశపెట్టిన సీఎం మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్రంలో ఇటీవల ఏర్పడిన నూతన ప్రభుత్వంపై ప్రజల్లో ఎన్నో ఆశలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి తొలి బడ్జెట్‌ను గురువారం ప్రవేశపెట్టింది. రాష్ట్ర ఆర్థిక శాఖను తన వద్దనే ఉంచుకున్న సీఎం మోహన్‌చరణ్ మాఝి శాసన సభలో రూ.2,65,000 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇది గత సంవత్సరం 2023–24 బడ్జెట్ అంచనాలు రూ.2,30,000 కోట్లతో పోలిస్తే 15 శాతం పెరుగుదలను సూచిస్తుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వికసిత ఒడిశా తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జీఎస్‌డీపీ 8 శాతానికి పెరుగుతుందని అంచనా వేశారు. ఇది రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రవేశపెట్టిన ప్రజా బడ్జెటుగా అభివర్ణించారు. రూప కల్పనకు వివిధ వర్గాల సలహాలు, సూచనలు, అంచనాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిపారు. సాధారణ ప్రజల నుంచి ఉన్నతమైన వ్యక్తుల వరకు మొత్తం 12,000 మంది అభిప్రాయాలు తీసుకున్నామన్నారు.

అన్ని రంగాలపై దృష్టి

బడ్జెట్‌లో వ్యవసాయం, పరిశ్రమలు, ఆరోగ్యం, విద్య, సేవా రంగాలపై దృష్టి సారించామని ముఖ్యమంత్రి తెలిపారు. రైతులు, మహిళలు, యువత, పేదల అభివృద్ధికి కొత్త బడ్జెట్‌లో పెద్దపీట వేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు తమకు సేవ చేసేందుకు అవకాశం ఇచ్చారని, వారి ఆకాంక్షలు నెరవేరుస్తామని పేర్కొన్నారు. సమ్మిళిత అభివృద్ధే తమ లక్ష్యమని, సబ్ కా సాథ్ , సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ అనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూత్రాలపై బడ్జెట్‌ను రూపొందించామని వెల్లడించారు. స్థిరమైన అభివృద్ధిపై దృష్టి సారించి, వివిధ రంగాల్లో వృద్ధి సాధించి అభివృద్ధి బాటలో రాష్ట్రాన్ని నడిపించే లక్ష్యంతో బడ్జెట్‌ను ప్రతిపాదించినట్లు చెప్పారు. బడ్జెట్‌లో పెరిగిన కేటాయింపులు రాష్ట్రంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు మరియు ఆర్థిక వృద్ధిని తప్పకుండా మెరుగుపరుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



స్పీకర్ సురమా పాఢికి బడ్జెట్ ప్రతులను అందజేస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝి

శాఖల వారీగా కేటాయింపులు పరిశీలిస్తే...

మహిళలు, శిశు అభివృద్ధి, మిషన్ శక్తి శాఖ

సుభద్ర యోజన	రూ.10,000 కోట్లు
మమత మరియు పీఎంఎంవీవై	రూ.521 కోట్లు
పోషణ్ అభియాన్	రూ.295 కోట్లు
మిషన్ శక్తి కార్యక్రమం	రూ.1,179 కోట్లు

పట్టణాభివృద్ధి శాఖ

భువనేశ్వర్ మెట్రో రైలు	రూ.1,000 కోట్లు
పట్టణ నీటి సరఫరా	రూ.357 కోట్లు
కొత్త నగర అభివృద్ధి	రూ.918 కోట్లు

ఆరోగ్య శాఖ

ఆయుష్మాన్ భారత్	రూ.500 కోట్లు
గోపబంధు జన ఆరోగ్య యోజన	రూ.5,450 కోట్లు
ముఖ్యమంత్రి స్వాస్థ్య సేవా మిషన్	రూ.2,462 కోట్లు
జాతీయ ఆరోగ్య మిషన్	రూ.2,095 కోట్లు

విద్యా శాఖ

గోపబంధు మిశ్రా ఆదర్శ ప్రాథమిక విద్యాలయం	రూ.50 కోట్లు
పంచసఖ శిక్ష్యా సేతు	రూ.332 కోట్లు
ముఖ్యమంత్రి శిక్ష్యా పురస్కారం	రూ.139 కోట్లు
పీఎం పోషణ్	రూ.997 కోట్లు
సమగ్ర విద్య	రూ.3,791 కోట్లు

వ్యవసాయం, రైతు సాధికారత శాఖ

సమృద్ధి కృషక్ యోజన	రూ.500 కోట్లు
సీఎం కిషాన్	రూ.1,935 కోట్లు
శ్రీఅన్న అభియాన్	రూ.649 కోట్లు
పంటల వైవిధ్యం	రూ.574 కోట్లు

మత్స్య, పశు అభివృద్ధి శాఖ

ఒడిశా మత్స్య మిషన్	రూ.344 కోట్లు
ప్రాణి సంపద సమృద్ధి యోజన	రూ.189 కోట్లు
గోమాత పథకం	రూ.37 కోట్లు
పీఎం మత్స్య సంపద యోజన	రూ.220 కోట్లు

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీల అభివృద్ధి శాఖ

మాధో సింగ్ హాత్ ఖర్చ్	రూ.156 కోట్లు
స్కాలర్‌షిప్	రూ.1,170 కోట్లు
ముఖ్యమంత్రి జనజాతి జీవికా	రూ.200 కోట్లు
పీఎం అజయ్	రూ. 266 కోట్లు
పీఎం ఏఏజీవై	రూ. 120 కోట్లు

సామాజిక భద్రత శాఖ

మధుబాబు పెన్షన్ యోజన	రూ.44,87 కోట్లు
భీమా భోయి దివ్యాంగుల సమర్థ అభిజాన్	రూ.30 కోట్లు
వయోవృద్ధులకు ఇళ్లు	రూ.56 కోట్లు
ఆధునాతన పునరావాస కేంద్రం (ఏఆర్‌సీ)	రూ.22 కోట్లు

శ్రీజగన్నాథ్, ఒడియా ఆత్మ గౌరవం (అస్మిత)

శ్రీజగన్నాథ ఆలయం కార్పస్ నిధి	రూ.500 కోట్లు
ఒడియా ఆత్మ గౌరవం కార్పస్ నిధి	రూ.200 కోట్లు
ముఖ్యమంత్రి కళాకర్ సహాయ యోజన	రూ.72 కోట్లు
స్మారక చిహ్నాల పరిరక్షణ, రక్షణ	రూ.15 కోట్లు

క్రీడలు, యువజన వ్యవహారాలు

క్రీడల మౌలిక సదుపాయాలు	రూ.952 కోట్లు
యువశక్తి	రూ.100 కోట్లు
అత్యుత్తమ క్రీడాకారులకు సాయం	రూ.60 కోట్లు
క్రీడా పోటీల నిర్వహణ	రూ.65 కోట్లు

అటవీ, పర్యావరణం

క్యాంపా	రూ.1,168 కోట్లు
సీఎం తునికాకు (కెందు) కార్మికుల యోజన	రూ.100 కోట్లు
నందన్ కానన్ జూ అభివృద్ధి, సుందరీకరణ	రూ.50 కోట్లు
హరిత మహానది మిషన్	రూ.42 కోట్లు

నిరాశ పరిచింది: మాజీ సీఎం నవీన్ పట్నాయక్

రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రెట్టింపు నిరాశపరిచిందని శాసనసభ విపక్ష నేత నవీన్ పట్నాయక్ అభిప్రాయం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ పథకాల పేర్లు మార్చి కొత్త పథకాలుగా ప్రవేశపెట్టారన్నారు. అటువంటివి 40కి పైగా ఉన్నాయని పేర్కొన్నారు. బడ్జెటు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత వ్యాఖ్యానించడం జరుగుతుందన్నారు.

మోసపూరిత బడ్జెటు: ఎమ్మెల్యే బాహిణీపతి

ఈ బడ్జెట్‌లో కొత్తదనం ఏమీ లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి అన్నారు. మహిళలు, రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రస్తుతం ఉన్న పథకాలకు కేవలం 10 నుంచి 20 శాతం మాత్రమే కేటాయింపులు పెంచారని అసహనం వ్యక్తం చేశారు. కొత్త పథకాలు లేకుండా 42 పథకాలకు పేరు మార్చారని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ప్రజలను పూర్తిగా మోసం చేసిందని ఆరోపించారు.

విపక్ష నేతను అరెస్టు చేయొచ్చు

- స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి: బీజేపీ
- అరెస్టు చేసి చూడండి: బీజేడీ



రాష్ట్ర శాసనసభ

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభలో కొనసాగుతున్న వర్షాకాలం, బడ్జెటు సమావేశాలు గురువారం సరికొత్త మలుపు తిరిగాయి. విపక్ష నేత నవీన్ పట్నాయక్‌ని అరెస్టు చేయాలనే ప్రకటనపై అధికార, విపక్షాలు అమీతుమీ తేలాల్సిందేనని సభలో రచ్చకు దిగాయి. శూన్య గంట సమావేశంలో ఈ వివాదంతో సభా వాతావరణం వేడెక్కింది. శాసనసభలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా అవాంతరాలు సృష్టించినందుకు ప్రతిపక్ష నేత నవీన్ పట్నాయక్‌ను అరెస్టు చేయవచ్చని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల మంత్రి ముఖేష్ మహాలింగ్ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. మంత్రి ప్రకటనతో రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. నలువైపుల నుంచి అధికార పక్షం తీరుపై విమర్శలు గుప్పుమన్నాయి. అయితే మంత్రి ప్రకటనకు రెండు రోజుల తర్వాత అధికార పక్షం సభ్యులు మంత్రికి మద్దతుగా నిలిచారు. సభ నిబంధనల ప్రకారం అంతరాయం కలిగించే వారికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేశారు.

నిబంధనలు పాటించాల్సిందే..

ఈ వివాదంపై భట్లీ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే ఇరాసిస్ ఆచార్య మాట్లాడుతూ శాసనసభలో గవర్నర్ ప్రసంగం సమయంలో సభ్యులు నిబంధనలు పాటించాల్సిందేనన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సవరణలోని రూల్ 18లో ఈ నిబంధనలు పేర్కొనట్లు వెల్లడించారు. అదేవిధంగా సభలో గవర్నర్ ప్రసంగం సమయంలో అవాంతరాలు కలిగిస్తే చర్యలు తీసుకోవాలని 1968 ఏప్రిల్‌లో అప్పటి స్పీకర్ నియమించిన కమిటీ సిఫార్సు చేసిందని పేర్కొన్నారు. సభలో గవర్నర్ ప్రసంగం సమయంలో అంతరాయం, ఆటంకం ఏర్పడితే ఎలాంటి చర్యలు తీసుకోవచ్చో కూడా తెలియజేశారు. అలాగే రాష్ట్ర క్రీడలు మరియు యువజన సేవల సహాయ మంత్రి సూర్య వంశీ సూరజ్ మాట్లాడుతూ.. రాష్ట్రపతి లేదా గవర్నర్ ప్రసంగంలో ఎటువంటి పరిస్థితుల్లోనూ క్రమశిక్షణా రాహిత్యాన్ని సహించబోమని నిబంధనలు స్పష్టంగా చెబుతున్నాయని తెలిపారు.

హాస్యాస్పదమైన చర్య

బీజేపీ నేతల వ్యాఖ్యలపై తీవ్రంగా ప్రతిస్పందించిన బీజేడీ ఎమ్మెల్యే అరుణ్ సాహూ దీనిని హాస్యాస్పద చర్యగా వ్యాఖ్యానించారు. అలాంటి వ్యాఖ్యలు వారి అనుభవ రాహిత్యాన్ని, అపరిపక్వతను తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ప్రకటనలు చేయడం మానుకోవాలని సూచించారు. అసెంబ్లీ లేదా పార్లమెంట్ కార్యకలాపాలపై ఎవరినీ అరెస్టు చేయడం తాను ఎప్పుడూ చూడలేదన్నారు. దమ్ముంటే ప్రతిపక్ష నేతను అరెస్టు చేయాలని సవాల్ విసిరారు.

ఎవరో వస్తారని ఎదురు చూడక..!



ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తమ పంట పొలాలను సస్యశ్యామలం చేసుకునేందుకు సాగునీటి కాలువను మూడు గ్రామాల రైతులు తవ్వుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని కొలనార సమితి పరిధి దుందులి, దొరబడ, కెవుటిగుడ గ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్నారు. వర్షాలపై ఆధారపడి వ్యవసాయాన్ని చేస్తుంటారు. అయితే ఈసారి ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో వర్షాలు కురవకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. దీంతో సమీపంలోని చెక్‌డ్యాం నుంచి సాగునీరు కాలువను తవ్వించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. ఈ మేరకు అధికారులు, నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేకపోయింది. దీంతో రైతులంతా సమావేశమై చేయి చేయి కలిపి స్వయంగా తమ పంట పొలాలకు సాగునీటి కాలువను తామే తవ్వుకున్నారు. దీంతో ఈ ఏడాది రెండు వందల ఎకరాల విస్తీర్ణంలో వరి పంటకు పుష్కలంగా సాగునీరు అందే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

– రాయగడ

దొంగతనాల కేసుల్లో నిందితులు అరెస్టు

రాయగడ: ఇటీవల జరిగిన రెండు దొంగతనం కేసులకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో నయాగడ జిల్లాలోని నాగపూర్ గ్రామానికి చెందిన సంతోష్ కుమార్ సాహు, చందిలి పోలీసుస్టేషన్ పరిధిలోని సాయిప్రియనగర్‌కు చెందిన కె.సుమన్‌లు ఉన్నట్లు నిర్ధారించారు. రాయగడ ఎస్‌డీపీవో రస్మీరంజన్ సేనాపతి ఈ మేరకు గురువారం మధ్యాహ్నం సదరు పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గత జూన్ 5వ తేదీన సాయిప్రియ నగర్‌కు చెందిన ప్రదీప్ కుమార్ పాఢి అనే వ్యక్తి మార్నింగ్ వాక్ చేస్తుండగా, శివ మందిరం సమీపంలో గుర్తు తెలియని దండగుడు అతడిని అడ్డగించి మెడలో బంగారు గొలుసును తెంపుకొని వెళ్లిపోయాడు. ఈ మేరకు బాధితుడు చందిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు కె.సుమన్ అనే నిందితుడిని అరెస్టు చేశారు. అతని నుంచి రూ.1.40 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. దొంగతనం చేసిన బంగారు గొలుసును నిందితుడు విక్రయించగా వచ్చిన నగదును తాము స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌డీపీవో తెలియజేశారు. అయితే ఈ కేసుకు సంబంధించి గొలుసును ఖరీదు చేసిన వ్యక్తిని అరెస్టు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో సేనాపతి పక్కనే కుహరో, బెహర



స్వాధీనం చేసుకున్న వెండి కడ్డీలను అందజేస్తున్న దృశ్యం

విగ్రహం దొంగలించిన వ్యక్తి...

అదేవిధంగా ఈ ఏడాది ఫిబ్రవరి 12వ తేదీన స్థానిక న్యూకాలనీలోని సత్యసాయి మందిరంలో వెండితో తయారు చేసిన సాయిబాబా బొమ్మను ఎవరో దొంగిలించినట్లు మందిరానికి చెందిన సభ్యుడు శివకుమార్ అగ్రవాల్ చందిలి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు చేపట్టిన దర్యాప్తులో భాగంగా ఈ కేసుకు సంబంధించి నాయగడ్ జిల్లాలోని నాగపూర్ గ్రామానికి చెందిన సంతోష్ కుమార్ సాహును అరెస్టు చేశారు. నిందితుడు దొంగిలించిన విగ్రహాన్ని కరిగించి వెండి కడ్డీలుగా రూపొందించాడని, వాటిని తాము స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ రెండు కేసుల్లో స్వాధీనం చేసుకున్న సొత్తును బాధితులకు సదరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. సమావేశంలో రాయగడ ఐఐసీ కేకేబీకే కుహరో, చందిలి పోలీసుస్టేషన్ ఐఐసీ ప్రసన్న కుమార్ బెహర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ పి.లత తెలిపారు. కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. వీటికి దరఖాస్తులు కోరుతున్నామని, పీజీ చేసి ఉండాలని కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. అలాగే పీహెచ్‌డీ, నెట్, సెట్, ఎస్‌ఎల్‌ఈటీ వంటి అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 28 తేదీలోగా పోస్టు ద్వారా, నేరుగా అయినా వచ్చి దరఖాస్తులు ఇవ్వవచ్చన్నారు. 29న మౌఖి క పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు.

అరసవల్లిలో అమరావతి రైతుల ప్రత్యేక పూజలు

అరసవల్లి: అమరావతి టు అరసవల్లి పేరుతో రాజధాని ప్రాంత రైతులు గురువారం ఉదయానికి అరసవల్లి ఆదిత్యుని సన్నిధికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి స్థానిక టీడీపీ క్యాడర్ ఘనంగాఆహ్వానించి అధికారికంగా ఆల య ఈఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ లు చేయించారు. మహిళలు హనుమాన్ చాలీసాను 108 సార్లు పారాయణ పఠనం చేశారు. అమరావతి రైతులు అరసవల్లి వస్తున్న సమాచారం ఉన్నప్పటికీ స్థానిక టీడీపీ నేతలు మినహా జనసేన, బీజేపీ నేతలెవ్వరూ కనిపించ లేదు.

రొట్టవలస అగ్రికల్చర్ అసిస్టెంట్ సస్పెండ్

సరుబుజ్జిలి: రొట్టవలస గ్రామ సచివాలయంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.దుర్గారావుని విధి నిర్వహణలో అలసత్వం కారణంగా విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు మండల వ్యవసాయాధికారి బి.పద్మనాభం గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. దుర్గారావు విధులకు మద్యం సేవించి హాజరవుతూ, రైతులకు ఎరువులు, ఇతరత్రా సరకులు అందించడంలో నిర్లక్ష్యం వహించినట్లు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, అగ్రికల్చర్ ఏడీ విచారణ నిర్వహించి అగ్రికల్చర్ జేడీకి ఇచ్చిన నివేదిక మేరకు సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.

డిప్లమా పారామెడిల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: ఏపీ స్టేట్ అండ్ హెల్త్‌కేర్ కౌన్సిల్ సెక్రటరీ డిప్లమో పారామెడికల్ కోర్సులకు కన్వీనర్ కోటాలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 6వ తేదీ వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కోర్సులకు ఇంటర్ ఏ గ్రూప్ పాసైన వారైనా అర్హులేనన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. తమ కళాశాలలో మేనేజ్‌మెంట్, కన్వీనర్ కోటాలో అందుబాటులో సీట్లు ఉన్నాయని ఆసక్తి గల వారు తగు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 7995013422, 7680945357 నంబర్లను సంప్రదించాలని కోరారు.

28న జిల్లా సీనియర్స్ బీచ్ కబడ్డీ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల జట్ల ఎంపికలను ఈనెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్టు శ్రీకాకుళం జిల్లా కబడ్డీ, బీచ్ కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాదు శ్రీనివాసరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎంపికల్లో పాల్గొనే వారికి ఎలాంటి వయో నిబంధనలు లేవని, అయితే పురుషులు, 85 కేజీలు, మహిళలు 75 కేజీలలోపు బరువు ఉండాలని స్పష్టం చేశారు. ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా జట్లను ఆగస్టు 2 నుంచి 4 వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరు వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు పంపించనున్నట్టు చెప్పారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సాదు శ్రీను కోరారు. మరిన్ని వివరాలకు 8074066282, 9441262515 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇంటర్నేషనల్ జర్నల్‌లో పలాస యువకుడి థీసిస్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 20వ వార్డుకు చెందిన బమ్మిడి సంతోష్‌కుమార్ రాసిన రాతలు ఇంటర్నేషనల్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఆంధ్రా యూనివర్సిటీలో పీహెచ్‌డీ స్కాలర్‌గా ఉన్న సంతోష్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్‌పై సోషియో ఎకనామిక్ ఇంపాక్ట్ ఆన్ ద రూరల్ ఎకానమీ అనే అంశంపై రాసిన పేపర్‌ను యూజీసీ వారి సహకారంతో ఇంటర్నేషనల్ జర్నల్‌లో ప్రచురించారు. దీనిపై సంతోష్‌కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో వలసలు నివారించడానికి గ్రామీణ స్థాయిలో ఆదాయాన్ని మెరుగుపరచడానికి ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుని వచ్చిన ఉపాధి హామీ పథకంపై తాను థీసిస్ రాసినట్లు తెలిపారు. ప్రస్తుతానికి గ్రామస్థాయిలో ఒక వ్యక్తి ఆదాయ స్థితిగతులు, జీవన స్థితిగతుల్ని స్టడీ చేసి పేపర్ ప్రజెంటేషన్ చేసి రాసి ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ప్రస్తుతం పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులుగా పనిచేస్తున్నారు.

వర్షంతో కూలిపోయిన ఇళ్లు



కుమార్‌వీధిలో పడిపోయిన ఇల్లు



పోడియా సమితిలో కూలిపోయిన ఇల్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి కుమార్ వీధిలో గురువారం మధ్యాహ్నం ఒక ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంటిలో 10 ఏళ్ల బాలుడు ఉండిపోవడంతో, వెంటనే స్థానికులు స్పందించి బయటకు తీసుకొచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. రోజుకూలీగా పనిచేస్తున్న దళపతి అనే వ్యక్తి తన భార్య, పిల్లలతో కుమార్ వీధిలోని ఒక మట్టి ఇంట్లో నివసిస్తున్నాడు. ఇటీవల ఆయన బావమరిదులు అక్కను చూసేందుకు మత్తిలి నుంచి వచ్చి, వర్షాలు కారణంగా అక్కడే ఉండిపోయారు. దీంతో గురువారం ఉదయం మత్తిలిలో బావమరుదులను దించేందుకు బయల్దేరుతున్న సమయంలో, వారు నివసిస్తున్న ఇల్లు ఒక్కసారిగా కూలిపోయింది. ప్రమాదంలో 10 ఏళ్ల బాలుడు ఇంట్లో చిక్కుకుపోవడంతో అతడికి కాలిపై గాయమైంది. వెంటనే మలకన్‌గిరి రెవెన్యూ కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో ఆర్‌ఐ వచ్చి పరిస్థితి పరిశీలించారు. దీంతో వారిని స్థానిక బస్టాండ్ వద్దనున్న రిలీఫ్ కేంద్రానికి తరలించారు. అనంతరం ప్రభుత్వం తరుపున అందాల్సిన సౌకర్యాలు అందజేస్తామని పేర్కొన్నారు.



రోడ్డున పడిన దళపతి కుటుంబం

పోడియా సమితిలో...

అదేవిధంగా పోడియా సమితి మట్టేరు పంచాయతీ రీఖిలిగూఢ గ్రామంలో ఒక యువతికి చెందిన ఇల్లు వర్షానికి బుధవారం రాత్రి కూలిపోయింది. అయితే ఆ సమయంలో యువతి ఇంట్లోనే ఉంది. కానీ అదృష్టావశాత్తు ఆమెకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. వివరాల్లోకి వెళ్తే.. రీఖిలిగూఢ గ్రామానికి చెందిన దేబి బేట్టి అనే యువతి తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె అన్నను కూడా మావోలు కొంతకాలం క్రితం చంపేశారు. అప్పటి నుంచి ఆమె ఒంటరిగానే ఉంటుంది. ఆమె వికలాంగురాలు. అయితే ఈ విషయం తెలిసిన మట్టేర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి సంఘటన స్థలానికి చేరుకొని 20 కేజీల బియ్యం, రూ.500 నగదు అందజేశారు. త్వరలోనే ఆమెకు ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు.

ఎక్స్‌గ్రేషియా మంజూరు

భువనేశ్వర్: గంజాం జిల్లా ఖల్లికోట్ తహసీల్ చెరువులో మునిగి ఇద్దరు వ్యక్తులు మరణించడం, బొలంగీర్ జిల్లా సాంయితొలా మండలంలో పాము కాటుతో ఇద్దరు వ్యక్తులు మరణించడంపై ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సంతాపం తెలియజేశారు. వారి కుటుంబీకులపై సానుభూతి ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర విపత్తు సహాయ నిధి నుంచి ఒక్కొక్కరికీ రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని ఆదేశించారు.

సేవా పేపరు మిల్లులో నిలిచిన ఉత్పత్తి..?

జయపురం: ఇప్పటికే శ్రామికుల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న జయపురం ప్రాంతంలోని సేవా పేపరు మిల్లులో ముడి సరుకు కొరత కారణంగా ఉత్పత్తి నిలిచిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకు ముఖ్యంగా కలప, బొగ్గు, క్లోరిన్ గేస్, రసాయనిక కెమికల్స్ నిల్వ లేకపోవడం వలన ఒక యూనిట్‌లో సక్రమంగా ఉత్పత్తి జరగడం లేదని సమాచారం. ఇదివరకు ఒకసారి మిల్లు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొని 2020 ఏప్రిల్ నుంచి 2021 నవంబర్ వరకు అంటే దాదాపు 20 నెలలు బంద్ అయ్యింది. అనంతరం హైదరాబాద్‌కు చెందిన మదర్ అర్థర్ రిసోర్స్ ప్రైవేట్ కంపెనీ వారు మిల్లు నడిపే బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 2022 మే నుంచి పేపర్ ఉత్పత్తి ప్రారంభించారు. అయితే అప్పటి నుంచి సమస్యల మధ్యనే సాగుతూ వస్తోంది. గత నెలలో పర్యావరణ పరిరక్షణ పేరుతో మిల్లు కొన్ని రోజులు బంద్ అయ్యింది. తిరిగి గురువారం ముడి సరుకులు కొరత కారణంగా ఉత్పత్తికి అంతరాయం కలిగిందని తెలిసింది. ఈ మిల్లులో ఉత్పత్తయ్యే పేపర్‌కు మార్కెట్టులో మంచి గిరాకీ ఉందని, అధిక లాభాలు వస్తున్నా యాజమాన్యం మిల్లును ఎందుకు సక్రమంగా నడపలేకపోతోందో తెలియడం లేదని మిల్లు ఉద్యోగులు, శ్రామిక సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే మిల్లు పరిస్థితిని ప్రభుత్వానికి తెలియజేసి పూర్తిస్థాయిలో నడిపేందుకు పాలకులను ఒప్పించాలని కోరుతున్నారు.



సేవా పేపర్ మిల్లు

ట్రక్ బోల్తా

- 9 మందికి గాయాలు



బోల్తాపడిన ట్రక్

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి పండ్రీపాణి పంచాయతీ నుంచి పద్మగిరి గ్రామానికి వెళ్తున్న ఒక ట్రక్ పెడకొండ గ్రామం వద్ద గురువారం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ట్రక్‌పై ఉన్న 9 మంది కూలీలకు గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఐఐసీ రీగాన్ కీండో తన సిబ్బందితో వెళ్లి కేసు నమోదు చేశారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

రాయగడ: స్థానిక ఉత్కళ ఆంధ్ర బ్రాహ్మణ సేవా సమాజం వారు పేద బ్రాహ్మణ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం రాత్రి బాలాజీనగర్‌లోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో సంఘం సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు రేజేటి శ్రీనివాస్ శర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇటీవల మృతి చెందిన సంస్థ వ్యవస్థాపక సభ్యుడు భళ్లమూడి రామశాస్త్రి (88)కి సంతాపం ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆగస్టు 4వ తేదీన వేంకటేశ్వర ఆలయ కల్యాణ మంపడంలో సాయంత్రం 5 గంటలకు సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సంఘ సభ్యుడు కట్టమూరి జగన్నాథ్‌కు రూ.11,600 నగదు సాయంగా అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి భళ్లమూడి నాగరాజు, కోశాధికారి భగవతుల సుబ్రహ్మణ్యం శాస్త్రి, పీవీ భాస్కరాచార్యులు, పి.గణపతి శాస్త్రి, ఎంవీ రమణ మూర్తి, భాగవతుల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథ్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘం సభ్యులు

నాటుసారాతో వ్యక్తి అరెస్టు



పట్టుబడిన త్రినాథ్ మంగురియ

జయపురం: అక్రమంగా నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని జయపురం ఎక్సైజ్ సిబ్బంది అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి జయపురం సమితి ఉమ్మిరి గ్రామానికి చెందిన త్రినాథ్ మంగురియ అని జయపురం ఎక్సైజ్ అధికారి నీలాద్రి బిహారీ మిశ్రగా పేర్కొన్నారు. నాటుసారా రవాణా అవుతోందనే సమాచారం మేరకు ఎక్సైజ్ సిబ్బంది ఉమ్మిరి గ్రామ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాటుసారా తీసుకొని వస్తుండగా అరెస్టు చేశారు. అతని వద్దనున్న 9 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

హిరాకుద్‌లో నీటి విడుదలకు సన్నాహాలు

- దిగువ జిల్లాలకు హై అలెర్ట్

భువనేశ్వర్: హిరాకుద్ జలాశయంలో వరద నీటి విడుదలకు సన్నాహాలు ప్రారంభించారు. జలాశయంలో నీటిమట్టం నిర్వహించే లక్ష్యంతో హిరాకుద్ డ్యామ్ అధికారులు ఈనెల 28న జలాశయం నుంచి ఈ సీజన్‌లో మొదటిసారి వరద నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో దిగువ జిల్లాలకు హై అలెర్ట్ జారీ చేశారు. లోతట్టు నివాసితులు స్వీయ రక్షణతో ఆస్తులను రక్షించుకోవడానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. మహానది ఎగువ పరివాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా హిరాకుద్ జలాశయంలో నీటిమట్టం పెరుగుతోంది. ఈ ఏడాది తొలి వరద నీటిని విడుదల చేసేందుకు హిరాకుద్ డ్యామ్ స్లూయిస్ గేట్లను జూలై 28న ఉదయం 9 గంటలకు తెరవనున్నట్లు హిరాకుద్ డ్యామ్ చీఫ్ ఇంజినీర్ సుశీల్ కుమార్ బెహెరా తెలిపారు. హిరాకుద్ జలాశయంలో నీటి మట్టం 2 అడుగుల మేర పెరిగి గురువారం నాటికి 604 అడుగులకు చేరుకుంది. ఈ జలాశయం గరిష్ట నీటి మట్టం పరిమితి 630 అడుగులు. ఎగువ పరివాహకలో నీటిపోటుతో ఈ జలాశయంలో నీటిమట్టం శరవేగంగా పెరుగుతోంది. పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని మహానది ఎగువ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షపాతం కారణంగా జలాశయంలోకి సెకన్‌కు 1,72,176 క్యూసెక్కుల వరదనీరు చేరుతోంది.

1200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కాశీబుగ్గ: మందస మండలం కొండలోగాం పంచాయతీ పరిధి చాపరాయి గ్రామంలో పోలీసులు ఆకస్మిక మెరుపు దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ గ్రామంలో ఎవరు నాటుసారా బట్టీలు నిర్వహిస్తున్నారనే కోణంలో విచారణ చేసి వారిపై కూడా తగు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది కాంతారావు, శాంతరావు తదితరులు పాల్గొన్నారు. మందస మండలంలో నాటుసారాని పూర్తి స్థాయిలో నివారించడానికి కృషిచేస్తున్నామని సెబ్ సీఐ ఆర్ జైభీమ్ తెలిపారు. నాటసారా తయారీ, రవాణా గురించి గానీ, నాటుసారా అమ్మకాలను గురించి గాని 9440902358 నంబరకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

వర్సిటీ అధ్యయన కేంద్రానికి డైరెక్టర్ నియామకం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రారంభించిన అధ్యయ న కేంద్రానికి ఆర్గానిక్ కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.పద్మారావును డైరెక్టర్‌గా నియమిస్తూ రిజిస్ట్రార్ పి.సుజాత గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులను వైస్ చాన్స్‌లర్ కేఆర్ రజినికి అందజేశారు. ఆమె మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో పరిశోధనలు ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు, బోధకులు పరిశోధనలకు ప్రాధాన్యతన ఇవ్వాలని సూచించారు.



పద్మారావుకు నియామక పత్రం అందజేస్తున్న వీసీ రజని

'ప్రయాణికులకు సదుపాయాలు కల్పిస్తాం'

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో ప్రయాణించే వారికి మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తామని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ రవికుమార్ అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయంలో గురువారం ఆర్టీసీ ఈడీ సీహెచ్ రవికుమార్ డిప్యూటీ సీటీఎం (ఓ అండ్ సి) అప్పలనాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన, సౌకర్యవంతమైన, మంచి కండిషన్‌లో గల బస్సులను ఇవ్వాలని ఆర్టీసీ ఒకటి, రెండు డిపోల డీఎంలకు సూచించారు. ప్రయాణికుల సరుకులను అత్యంత వేగంగా, భద్రంగా, దూర ప్రాంతాలకు కూడా చేరవేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని శ్రీకాకుళం జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.విజయ్‌కుమార్, శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ పి.మల్లికార్జునరాజు, రెండో డిపో మేనేజర్ కెఆర్ఎస్ శర్మ, ఆర్టీసీ డీఈ బమ్మిడి రవికుమార్, శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎండీఏ బాషా, ఎల్ఎస్ నాయుడు, ఆచారి, ప్రసాద్, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కాంప్లెక్స్ ఆవరణలోని నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద పరిశీలిస్తున్న ఈడీ రవికుమార్

భారీగా గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన కారు, నిందితులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్ భఘమర్రి పంచాయతీ శికులిపదర్ వద్ద ఒక కారులో తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఆ రోడ్డులో గురువారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక కారు వచ్చింది. ఆ కారులో సోదాలు చేయగా గంజాయి బస్తాలు ఉన్నట్లు గమనించారు. అలాగే కారుకు వెనుక వస్తున్న బైక్‌ను కూడా పట్టుకున్నారు. పట్టుబడిన కారులో ఐదు క్వింటాళ్ల గంజాయి ఉన్నట్లు తూకం వేసిన అనంతరం మోహనా తహసీల్దార్ సత్యబాన్ నాయక్ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. కారును సీజ్ చేయడంతో పాటు నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని మోహనా నుంచి భువనేశ్వర్‌కు తరలిస్తుండగా పట్టుబడినట్లు పేర్కొన్నారు. అరెస్టైనవారిలో సంజయ్ స్వయిని, కన్హూచరణ్ భుయ్యాన్, లోకా మఝి, ఎగులు బిశోయి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

జర్నలిస్ట్ ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు



మధుమిత పరిడా(ఫైల్)



శ్రీధర్ జెనా

భువనేశ్వర్: రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న మహిళా జర్నలిస్టు కేసులో నిందితుడైన భర్తను స్థానిక ధౌలి థాణా పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మరణించిన మహిళా జర్నలిస్టు మధుమిత పరిడా కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు శ్రీధర్ జెనాపై పోలీసులు చర్యలు చేపట్టి కోర్టుకు తరలించినట్లు భువనేశ్వర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రతీక్ సింగ్ తెలిపారు. భువనేశ్వర్‌లోని ఓ వెబ్ ఛానెల్‌లో పనిచేస్తున్న మధుమిత ఐదేళ్ల ప్రేమ అనంతరం మార్చి 1వ తేదీన శ్రీధర్‌ను వివాహం చేసుకుంది. అయితే పెళ్లి తర్వాత తన భర్త శ్రీధర్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని మధుమిత ఆరోపించింది. తన మరణానికి ముందు రికార్డ్ చేసిన వీడియోలో, మధుమిత తన భర్త వేరే అమ్మాయిని పెళ్లి చేసుకోబోతున్నాడని, విడాకుల నోటీసు కూడా ఇచ్చాడని పేర్కొంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఆయనను అరెస్టు చేశారు.

ఆయిల్ ఇంజిన్లు చోరీ

జలుమూరు: మండల పరిధిలోని కరకవలస, శ్రీముఖలింగం, అక్కురాడ తదితర గ్రామాల్లో వరుసగా ఆయిల్ ఇంజిన్లు చోరీకి గురవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వంశధార కాలవలు, చెరువుల నుంచి నీటిని ఆయా పంట పొలాలకు తోడే ఇంజిన్లు మండల పరిధిలోని పలు గ్రామాల్లో చోరీకి గురయ్యాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులైన వరి నాట్లు వేయడం, దమ్ము పట్టడం తదితర పనుల కోసం మెరక ప్రాంతాలు, కూరగాయల సాగునకు నీటి ఇంజిన్లు ఎంతో అవసరం. ఇప్పటికే మండలంలో చాలా వరకూ ఆయిల్ ఇంజిన్లు పోలీసులు స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. ఇందులో త్రీ హెచ్‌పీ నుంచి ఫైవ్ హెచ్‌పీ వరకూ ఉన్నాయి. ఒక్కో ఇంజిన్ రూ. 25 వేలు నుంచి రూ.లక్ష వరకూ ఉంటుందని రైతులు చెబుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో పోయినవి ఇంకా పట్టుకోవాల్సి ఉంది. దొరికన ఆయిల్ ఇంజిన్లు రైతులకు అప్పజెప్పాలని రైతులు కోరుతున్నారు. దీనిపై హెచ్‌సీ రాజశేఖర్‌ను వివరణ కోరగా కేసు నమోదు కాలేదని తెలిపారు.



స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఆయిల్ ఇంజిన్లు

రిమ్స్ వద్ద ఆందోళన

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్‌కు కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్స కోసం వచ్చిన ఓ మహిళ మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రిమ్స్‌లో బుధవారం ఈ సంఘటన చోటుచేసుకోగా గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెలితే... లావేరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పి.లక్ష్మి అనే మహిళ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స కోసం మంగళవారం రిమ్స్‌లో చేరారు. బుధవారం మధ్యాహ్నం ఆమెకు శస్త్ర చికిత్స నిర్వహించారు. అదే రోజు సాయంత్రం ఆమె మృతి చెందారు. శస్త్ర చికిత్స వికటించటం వల్లనే లక్ష్మి మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తూ మృతదేహాన్ని తీసుకు వెళ్లేందుకు నిరాకరించారు. కొందరు పెద్దలు జోక్యం చేసుకుని లక్ష్మి కుటుంబానికి న్యాయం చేయాలని కోరగా ప్రభుత్వం తరపున సాయం అందేలా చూస్తామని అధికారులు భరోసా ఇవ్వటంతో పరిస్థితి సద్దుమణిగింది. గురువారం ఉదయం మరోసారి మృతురాలి బంధువులు ఆస్పత్రికి వచ్చి ఆందోళన చేపట్టడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షితో పాటు ప్రత్యేక బృందం సభ్యులు రిమ్స్ అధికారులను విచారించారు. గుండె పోటు తో లక్ష్మి మృతి చెందినట్లు నిర్ధారణకు వచ్చారు. ఇదే విషయాన్ని ఉన్నత అధికారులకు నివేదించారు. ప్రభుత్వ సహాయం కోసం సిఫారసు చేస్తూ నివేదికను పంపించారు. ఈ విషయంలో పోలీసులు కూడా విచారణ చేస్తున్నారు.

మత్స్యకారులకు ఇబ్బంది రాకూడదు

- సీఆర్‌జెడ్ అమలుపై ప్రజాభిప్రాయ సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కోస్టల్ రెగ్యులేషన్ జోన్(సీఆర్‌జెడ్) అమలు చేసే క్రమంలో మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకూడదని తీర ప్రాంత ప్రజలు స్పష్టం చేశారు. జిల్లా కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఖరారులో భాగంగా సీఆర్‌జెడ్ నోటిఫికేషన్ విడుదలపై గురువారం తీర ప్రాంత ప్రజలు, అధికారులతో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఆర్‌జెడ్‌పై అభ్యంతరాలు, సలహాలు, సూచనలు అందించాలని కోరారు. అభిప్రాయాలను రికార్డు చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. అలాగే సూచనలు, సలహాలు, అభ్యంతరాలు ఉంటే ఇప్పుడే తెలియజేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అప్పికొండ రామారావు నాయుడు కోరారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డీడీ సుభాన్, చెన్నై నుంచి వచ్చిన కన్సల్టెన్సీ కరుణానిధి, యువరాజ్ సీఆర్‌జెడ్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

- కేవీ జగన్నాథరావు మాట్లాడుతూ పైడిభీమవరం వంటి ప్రదేశాల్లో పరిశ్రమల మీద తగిన నియంత్రణ చేసి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.
- కోనాడ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పైడిభీమవరంలో కంపెనీలు ఏర్పాటు చేశారని, కొవ్వాడలో అణువిద్యుత్ ఏర్పాటు చేశారని వీటి వల్ల తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. మత్స్యకారులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.
- కె.లక్ష్మణ్ మాట్లాడుతూ మత్స్యకారులకు అన్యాయం జరగకుండా న్యాయం చేయాలని కోరారు. మత్స్యకారుల పిల్లలు ఉద్యోగాలు పొందేందుకు కూడా అర్హత కలిగి ఉన్నారన్నారు.
- అమ్మన్ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ రణస్థలం మండలం తీర ప్రాంత గ్రామాల్లో పలు కంపెనీల నుంచి కాలుష్యాన్ని శుద్ధి చేయకుండా సముద్రంలో విడిచిపెడుతున్నారని తెలిపారు.
- కవిటి మండలం నుంచి పురుషోత్తం మాట్లాడుతూ ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి కోస్టల్ ఏరియా అంతా రోడ్లు వేస్తే టూరిజం అభివృద్ధి చెందుతుందన్నారు.
- గార మండలం బందరువానిపేట, మొగదలపాడు నుంచి రంగయ్య తమ ప్రాంతంలో హార్బర్ నిర్మించాలని కోరారు.
- జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్స్యకారుల వలసలు ఆపడానికి, మత్స్యకారులు జీవితాల్లో వెలుగు నింపే విధంగా సీఆర్‌జెడ్ ఉండాలన్నారు.
- కొత్తముక్కాం గ్రామం నుంచి యు.సన్యాసిరావు మాట్లాడుతూ సముద్ర తాబేళ్లు నశించిపోకుండా సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.
- జీరుపాలెం గ్రామం నుంచి నితిన్ మాట్లాడుతూ సీఆర్‌జెడ్‌లో బీచ్ కారిడార్ రోడ్డును గుర్తించాలని కోరారు. ఈస్ట్ కోస్ట్‌లో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటుకు సీఆర్‌జెడ్‌లో సూచనలు జారీ చేయాలని చెప్పారు.
- ఎచ్చెర్ల మండలం నుంచి సీహెచ్ సూర్య నారాయణ మాట్లాడుతూ సీఆర్‌జెడ్ అంశాలను ప్రస్తావించి వ్యతిరేకించారు.
- సముద్రానికి 50 మీటర్లలో మత్స్యకార కార్యకలాపాలు చేసుకోవచ్చని, మత్స్యకారులకు ఇబ్బంది లేదని, 500 మీటర్లు దాటిన తర్వాత టూరిజం, తదితరమైనవి నిర్వహించుకోవచ్చని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సుభాన్ వివరించారు. టూరిజం ప్రాజెక్టుల వద్ద మత్స్యకార బోట్‌లు పెట్టుకొనేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.
- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అప్పికొండ రామారావు నాయుడు మాట్లాడుతూ ఈ సమావేశంలో వ్యక్తపరిచిన అభిప్రాయాలు, సూచనలు ఎలాంటి మార్పులు లేకుండా రిపోర్ట్ తయారు చేసి ప్రైసైడింగ్ అధికారి అనుమతితో పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ కు పంపిస్తామన్నారు.

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం



108 వాహనంలో క్షతగాత్రుడు

కురుపాం: మండలంలోని మూలిగూడ జంక్షన్ వద్ద జీడిపిక్కల లారీకి గురువారం పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు.. జీడిపిక్కల లోడుతో గుమ్మలక్ష్మీపురం నుంచి తుని వెళ్తున్న భారీ లారీకి గురువారం ఉదయం 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలాయి. లారీ కేబిన్‌లో ఉన్న డ్రైవర్, క్లీనర్ విద్యుత్ షాక్‌కు గురయ్యారు. లారీ టైర్లు మంటల్లో కాలిపోతుండగా అదే సమయంలో విద్యుత్ ట్రిప్ కావడంతో సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రమాదం వారిద్దరూ బయటపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108లో కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. క్షతగాత్రులు అక్కడ వైద్య సేవలు పొందుతున్నారు.

సీజ్ చేసిన మద్యం ధ్వంసం



మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న పోలీసు సిబ్బంది

పాలకొండ: పలు కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం, సారాను గురువారం ధ్వంసం చేశారు. 436 లీటర్ల సారాను కాలువల్లో పారబోసారు. అలాగే 458 మద్యం సీసాలను ధ్వంసం చేశారు. రెవెన్యూ, పోలీసుల సమక్షంలో ఉదయం పోలీసుస్టేషన్ ఆవరణలో మద్యం సీసాల బహిరంగంగా ఉంచి వాటిని సిబ్బంది కాలువల్లో పారబోసారు. సీఐ చంద్రమౌళి, ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ యువత మత్తు పానీయాలకు అలవాటు పడకూడదని, సారా, గంజాయి వంటి వాటిని వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాలికపై కుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడిన పూర్ణ చంద్రిక

సంతకవిటి: మండల పరిధి మిర్తివలస గ్రామానికి చెందిన కొంచాడ పూర్ణ చంద్రిక(9)పై గురువారం కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. గ్రామంలోని పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న చంద్రిక పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న సమయంలో కుక్కలు దాడి చేశాయి. బాలిక కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుక్కలను తరమడంతో ప్రమాదం తప్పింది. అనంతరం చికిత్స కోసం శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో కుక్కలను నివారించాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

ఇద్దరికి గాయాలు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం గ్రామంలో రెండు రోజుల్లో కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. బుధవారం కారాడ శ్రీను కుక్క కాటుకు గురి కాగా, గురువారం కర్రి పోలమ్మపై దాడి చేశాయి. పోలమ్మను చినమేరంగి సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్య

మెంటాడ: మండలంలోని మీసాలపేటకు చెందిన వివాహిత క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ తెలిపిన వివరాలు... గ్రామంలోని గంట్యాడ స్వాతి(27)కి ఏడేళ్ల కిందట సత్యనారాయణతో వివాహం జరిగింది. వీరికి ఐదేళ్ల కుమార్తె ఉంది. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలో గురువారం ఉదయం స్వాతితో భర్త సత్యనారాయణ గొడవ పడి పనుల నిమిత్తం బయటకు వెళ్లాడు. ఆ కోపంలో స్వాతి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

మృత్యు ఒడిలో విద్యార్థులు

- మన్యంలో విజృంభిస్తున్న మలేరియా
- నెల రోజుల వ్యవధిలో ముగ్గురు విద్యార్థుల మృతి
- జ్వర పీడితులతో అల్లాడుతున్న మన్యం



పార్వతీపురం టౌన్: వర్షాకాలం వచ్చిందంటే చాలు మన్యంలో మలేరియా విజృంభిస్తోంది. గిరిజనులు, ముఖ్యంగా విద్యార్థులు మలేరియా దోమ కాటుకు గురై జ్వరాల బారిన పడుతున్నారు. ఆస్పత్రులకు వెళ్తున్న వీరికి మలేరియా మందులు అందుబాటులో లేకపోవడంతో సరైన వైద్యమందక మృత్యువాత పడుతున్నారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు గిరిజన విద్యార్థులు మృతి చెందారు. ఈ నెల 21న గుమ్మలక్ష్మీపురం మండలం వంగర గ్రామానికి చెందిన నాలుగో తరగతి విద్యార్థి ఎం.గౌతమ్ మలేరియా జ్వరంతో మరణించాడు. తాడికొండ పీహెచ్‌సీకి వైద్యం కోసం తీసుకువెళ్లగా మలేరియా మందులు అందుబాటులో లేవని సాధారణ మాత్రలతో సరిపెట్టారని బాలుని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ నెల 7న జొయమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న బి.ఈశ్వరరావు మలేరియాతో మృతి చెందాడు. మలేరియా మరణాలు జరుగుతున్నా ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నివారణా చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

జ్వర పీడితులతో అల్లాడుతున్న మన్యం

సీతంపేట, సాలూరు, భద్రగిరి ఏజెన్సీ ప్రాంతాల్లో జ్వర పీడితుల రాకతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులతో వందలాది సంఖ్యలో రోగులు వైద్యం కోసం ఆస్పత్రులకు వస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్యమందక మలేరియా జ్వరంతో విద్యార్థులు మృత్యు ఒడికి చేరుతూనే ఉన్నారు. చదువుకొనే పసిప్రాయంలో చిన్నారులు మరణించడంతో తల్లిదండ్రులకు కడుపు శోకం తప్పడం లేదు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా మందులు అందుబాటులో లేకపోవడంతో గిరిజనులకు మలేరియా వైద్యం అందని ద్రాక్షగా మిగిలింది. ఆర్థికంగా ఉన్న వారు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. నిరుపేదలు ప్రభుత్వ వైద్యంపైనే ఆధారపడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా నివారణకు చర్యలు ప్రభుత్వం చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. వర్షాకాలంలో పెరుగుతున్న రోగుల దృష్ట్యా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మలేరియా, డెంగీ మందులు అందుబాటులో ఉంచి స్థానికంగా మెరుగైన వైద్య సేవలందించే దిశగా చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

మరో విద్యార్థి మృతి

మండలంలోని రావికొన గిరిజన సంక్షేమ వసతిగృహ విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మక్కువ మండలం దుగ్గేరుకు చెందిన పి.రాఘవ ఈ నెల 13న తన కుటుంబీకులతో కలిసి దుగ్గేరు వెళ్లాడు. విద్యార్థి కోసం ఈ నెల 16న హాస్టల్ వార్డెన్ ఫోన్‌లో సంప్రదించగా జ్వరంతో పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. వెంటనే ఆయన స్పందించి ఆస్పత్రికి వెళ్లగా, వైద్యులు విద్యార్థిని విజయనగరం ఘోషాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ వారు కూడా మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ విషయాన్ని వార్డెన్ ఐటీడీఏ అధికారులు దృష్టిలోకి తీసుకువెళ్లి వారి సూచనల మేరకు ఈ నెల 17న కేజీహెచ్‌లో చేర్చారు. అక్కడ వైద్యం ఈ నెల 21న విద్యార్థి మృతి చెందాడు. విద్యార్థి మృతికి కారణం సెరిబ్రెల్ మలేరియాగా వైద్యులు గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలో వైరల్ జ్వరాలతో సంక్షేమ వసతిగృహ విద్యార్థులు వరుస మరణాలు జరుగుతుండడంతో వసతిగృహాల్లో ఏఎన్ఎంల నియామకం వెంటనే జరగాలని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుకుంటున్నారు.

విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలి



విద్యార్థుల ఆరోగ్యంతో ప్రభుత్వం చెలగాటమాడుతుంది. వసతిగృహాల్లో సీజనల్ వ్యాధుల పట్ల కనీస చర్యలు చేపట్టడం లేదు. ఇంత జరుగుతున్నా పాలకుల్లో గిరిజన విద్యార్థుల ప్రాణాలు కాపాడాలనే చిత్తశుద్ధి కనిపించడం లేదు. తక్షణమే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు, కళాశాల వసతి గృహాలకు ఏఎన్ఎంలను నియమించాలి. మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం చెల్లించాలి.

– పాలక రంజిత్‌కుమార్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి

‘ఫెడెక్స్, బ్లూడాట్’ పేరుతో వచ్చే కాల్స్ పట్ల తస్మాత్..

- ఎస్పీ వకుల్ జిందాల్



ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: ఫెడెక్స్, బ్లూడాట్ కొరియర్స్ పేర్లతో వచ్చే కాల్స్, లింక్స్, వీడియో కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల సైబర్ మోసగాళ్లు మొబైల్స్‌కు ఫోన్ చేసి తాము ఫెడెక్స్ లేదా బ్లూడాట్ కొరియర్స్ నుంచి మాట్లాడుతున్నామని, మన చిరునామా, ఆధార్ నెంబర్, ఫోన్ నంబరు వంటి కొంత సమాచారాన్ని ముందుగా మనకు తెలిపి, మనం బుక్ చేసిన కొరియర్ పార్సిల్‌లో నిషేధిత మాదక ద్రవ్యాలు, ఫేక్ పాస్‌పోర్ట్, బంగారం బిస్కెట్లు ఉన్నాయని, మనీ ల్యాండరింగ్‌కు పాల్పడుతున్నట్లుగా గుర్తించినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలను థైవాన్, ఇరాన్, చైనా వంటి దేశాలకు పంపుతున్నారని నిర్ధారణయ్యిందని, కేసు కూడా నమోదైందని పేర్కొన్నారు. విచారణ నిమిత్తం తాము సూచించిన సుదూర ప్రాంతానికి దర్యాప్తు నిమిత్తం రావాల్సి ఉంటుందన్న సమాచారాన్ని అందిస్తారన్నారు. ఇటువంటి కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలందరూ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్ నేరాల్లో ఎవరైనా నగదు పోగొట్టుకున్నట్లయితే 1930కు లేదా నేషనల్ క్రైమ్ పోర్టల్‌లో రిపోర్టు చేయాలని కోరారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో విజేతలుగా నిలవాలి



ఎంపికైన క్రీడాకారులతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు

- జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న తైక్వాండో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు విజేతలుగా నిలవాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. ఈ నెల 25 నుంచి 31 వరకు విజయనగరం వేదికగా నిర్వహిస్తోన్న రాష్ట్ర స్థాయి కోచింగ్ క్యాంప్‌ను ఆయన రాజీవ్ క్రీడా మైదానంలో ప్రారంభించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాంప్‌లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 25 మంది క్రీడాకారులకు క్యాడెట్ విభాగంలో శిక్షణ ఇవ్వటం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతో క్రీడల్లో రాణించటం ముఖ్యమేనని తెలిపారు. తద్వారా ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోగలరని సూచించారు. క్రీడల్లో రాణించే వారికి మంచి ఆరోగ్యంతో పాటు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆత్మరక్షణ విద్య తైక్వాండో పిల్లలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏపీ తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి డీవీ.చారి, కోచ్‌లు టి.రాము, ఎ.అకిల్, ఎన్.రవి, వినీష్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువలపై ప్రత్యేక పర్యవేక్షణ

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



తోటపల్లి ప్రాజెక్టు స్పిల్‌వేను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: తోటపల్లి ప్రాజెక్టు మట్టి కట్టలు, ప్రధాన కాలువలు కోతకు గురికాకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జల వనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు ప్రధాన కుడి కాలువ, స్పిల్‌వే రెగ్యులేటర్ నీటి ప్రవాహ స్థాయిని గురువారం పరిశీలించారు. తోటపల్లి ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటరీ వద్ద మిషనరీ కాంపోనెంట్స్, సాగునీటి విడుదల చేసే గేటులను పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు వద్ద నీటి నిల్వ స్థాయి, ప్రాజెక్ట్ కింద ఆయకట్టుకు అందుతున్న సాగునీరు, విస్తీర్ణం, మిగుల జలాల విడుదల, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ముంపు గ్రామాలు, తదితర విషయాలపై ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ ఇరువైపులా ఉండే బండలను వర్షాల వల్ల కోతకు గురి కాకుండా ప్రత్యేక పర్యవేక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రాజెక్టులో పేరుకుపోయిన గుర్రపుడెక్క నివారణకు శాస్త్రీయ, సాంకేతిక శాశ్వత పరిష్కారం కనుగొనాలని సూచించారు. తోటపల్లి ప్రాజెక్టు కాలువల నిర్వహణ పక్కాగా చేపట్టాలని అన్నారు. తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు, కాలువల నిర్వహణకు లష్కర్ల కొరత ఉన్నందున శాశ్వత ప్రాతిపదికన నియమించాల్సి ఉందని, తోటపల్లి పిల్ల కాలువల తవ్వకం కోసం భూమి సేకరించాల్సి ఉందని, కుడి ప్రధాన కాలువల కొన్ని రీచ్‌ల వద్ద సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు జరిపించాలని కలెక్టర్ దృష్టికి ఇంజినీరింగ్ అధికారులు తీసుకువచ్చారు. సాగునీటి కాల్వ పనులకు సక్రమంగా నిధులు వినియోగానికి తగిన యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయన వెంట జల వనరుల శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ రఘునందన్, జేఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులతో ఎస్‌ఐ

పాచిపెంట : మండలంలో పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద నలుగురు వ్యక్తుల నుంచి 3.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నారాయణ గురువారం తెలిపారు. పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా, నలుగురు వ్యక్తుల నుంచి 3.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒడిశా, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

బంగారం చోరీ



గజపతినగరం: బీరువా వద్ద వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం, చిత్రంలో సీఐ, ఎస్‌ఐ

గజపతినగరం : మండల కేంద్రంలో పాత ఎంపీడీఓ కార్యాలయం రోడ్డులో పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఓ ఇంట్లో బుధవారం రాత్రి దొంగలు చొరబడి బంగారాన్ని దోచుకెళ్లారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. పి.రాము కొన్నాళ్లుగా ఎంపీడీఓ కార్యాలయం రోడ్డులో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆయన ఇటీవల మండల వారి కాలనీలో నూతనంగా ఇల్లు నిర్మించాడు. రాము, భార్య స్వప్న, పిల్లలు పగలు అద్దె ఇంట్లో ఉంటూ రాత్రి కొత్తగా నిర్మించిన ఇంటికి వెళ్తున్నారు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి కూడా కొత్త ఇంటికి వెళ్లారు. దీన్ని గుర్తించిన దొంగలు ఇంటి తలుపులు విరగ్గొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలను విరగ్గొట్టి కొంత బంగారాన్ని దొంగలించుకుపోయారు. గురువారం ఉదయం రాము దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జిల్లా నుంచి క్లూస్ టీం అధికారి మురళి, సీఐ ఎన్వీ ప్రభాకరరావు, ఎస్‌ఐ యు.మహేష్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకొని వేలిముద్రలను సేకరించారు. దొంగతనం జరిగిన వివరాలను బాధిత కుటుంబ సభ్యుల నుంచి అడిగి తెలుసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బొబ్బిలి రూరల్: దర్యాప్తు చేస్తున్న పోలీసులు

8 తులాల బంగారం చోరీ

బొబ్బిలి రూరల్: మండలంలోని గొర్లెసీతారాంపురం గ్రామంలో 8తులాల బంగారం చోరీకి గురైందని బాధితులు ఫిర్యాదు చేశారు. బుధవారం జరిగిన ఈ సంఘటనపై ఎస్‌ఐ లోవరాజు దర్యాప్తు నిర్వహించారు. గ్రామంలో జలుమూరి అరుణ ఇంట్లో ఈ ఘటన జరిగినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ నెల 20న తన ఇంట్లో బీరువాలో బంగారం పెట్టినట్లు 23వ తేదీన బీరువా తెరచి చూస్తే అది కనిపించలేదని ఫిర్యాదు అందినట్టు ఎస్‌ఐ చెప్పారు. ఇది ఇంటి దొంగల పనేనన్న అనుమానం ఉందని ఎస్‌ఐ తెలిపారు. క్లూస్‌టీంలను రప్పించి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో ధరల పట్టికలు ఏర్పాటు చేయాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, ఫిజియోథెరిపీ క్లినిక్‌లు, స్కానింగ్ సెంటర్లు విధిగా టారిఫ్ బోర్డులు (ధరల పట్టిక) తెలుగు, ఇంగ్లిష్‌లో పెట్టాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరల బోర్డులు పెట్టని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి స్కాన్ సెంటర్, ఆస్పత్రులు, క్లినిక్స్, డయోగ్నోస్టిక్ సెంటర్లు ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. ఇంతవరకు వైద్య శాఖ అనుమతి తీసుకోని వారు తక్షణమే తీసుకోవాలన్నారు.

జూనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది జెడ్పీ హెచ్ పాఠశాలలో ఈ నెల 27న సాఫ్ట్‌బాల్ జూనియర్ క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ ఐ.విజయకుమార్ గురువారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను శ్రీకాకుళంలో ఆగస్టు 17, 18 తేదీల్లో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాలని ఆసక్తి ఉన్న బాలబాలికలు 2007 జనవరి 1 తరువాత పుట్టిన వారు అర్హులని తెలిపారు.

ఎన్నికల తహశీల్దార్లు రిలీవ్

విజయనగరం అర్బన్: సాధారణ ఎన్నికల నిబంధనల నేపథ్యంలో పక్క జిల్లాల నుంచి వచ్చిన 22 మంది తహసీల్దార్లను రిలీవ్ చేస్తూ కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. విశాఖ, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి వీరంతా ఎన్నిక ముందు అప్పట్లో జిల్లాకు బదిలీపై వచ్చారు. రిలీవ్ చేసిన వారిలో విశాఖ పట్టణానికి చెందిన 11 మంది, శ్రీకాకుళం జిల్లాకి చెందిన 10 మంది, పార్వతీపురం మన్యం జిల్లాకి చెందిన వారు ఒక్కరు ఉన్నారు.

సృజనాత్మక విద్యకు ప్రాధాన్యం

- యునిసెఫ్ ఏపీ ప్రతినిధి సుదర్శన్



అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో విద్యార్థులు సిద్ధం చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న యునిసెఫ్ రాష్ట్ర పరిశీలకుడు సుదర్శన్

చీపురుపల్లి: విద్యార్థులు సృజనాత్మక విద్యకు ప్రాధాన్యమివ్వాలని యునిసెఫ్ ఏపీ ప్రతినిధి సుదర్శన్ సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ల్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చీపురుపల్లి పట్టణంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌తోపాటు, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ల్యాబ్‌ను సందర్శించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో బేసిక్ ఎలక్ట్రానిక్ మెకానిక్స్ అండ్ అటల్ ఇన్నోవేషన్ మిషన్ సూచించిన పాఠ్యాంశాల మేరకు ప్రయోగశాలలో విద్యార్థులు సిద్ధం చేసిన వివిధ పరికరాలను పరిశీలించారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ల్యాబ్‌లో విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ తీరును ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా సైన్స్ అధికారి మిరియాల కృష్ణారావు ఉన్నారు.

31న ‘వీఆర్ఎస్’ ద్వారా సాగునీరు విడుదల



వీఆర్ఎస్ నీటిమట్టం పరిశీలించి, నీటి విడుదలపై చర్చిస్తున్న ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు

మక్కువ: వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ సువర్ణముఖి, గోముఖి రెగ్యులేటర్ల నుంచి ఈ నెల 31వ తేదీన కాలువలకు సాగునీరు విడుదల చేసేందుకు గురువారం ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు చర్చించి నిర్ణయం తీసుకున్నారు. వీఆర్ఎస్ ప్రాజెక్టును ఇరిగేషన్ ఈఈ ఆర్.అప్పలనాయుడు, డీఈ డి.సురేష్, జేఈలు, టీడీపీ మండలాధ్యక్షుడు గుళ్ల వేణుగోపాలరావు పరిశీలించారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుత నీటిమట్టం, కాలువలు పరిస్థితిపై చర్చించారు. ఈ నెల 31న గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి నీటిని విడుదల చేయనున్నట్లు ఈఈ ఆర్.అప్పలనాయుడు తెలిపారు. కాలువల ద్వారా పంట పొలాలాకు సాగునీరు సక్రమంగా సరఫరా చేసేందుకు జేసీబీ సహాయంతో పూడికలు తీయిస్తున్నట్లు తెలిపారు.

300 క్యూసెక్కుల నీరు విడుదల

గోముఖి రెగ్యులేటరు ద్వారా గోముఖినదిలోకి గురువారం 300క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు వీఆర్ఎస్ జేఈ శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల వర్షాలు కురుస్తున్నందున ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో చేరడంతో, ముందస్తు చర్యల్లో భాగంగా గోముఖి నదిలోకి నీటిని విడిచిపెట్టినట్లు ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామభద్రపురం: విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయం వద్ద ఈ నెల 16న గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. దాంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ పరిశీలించి చికిత్స నిమిత్తం 108 వాహనంలో బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి బంధువులెవరైనా ఉండి వస్తే పోస్టుమార్టం అనంతరం మృతదేహం అప్పగిస్తారని ఎస్‌ఐ తెలిపారు.

పంట కాలువలోకి దూసుకెళ్లిన కారు



ప్రమాదానికి గురైన మారుతీ వ్యాన్

శృంగవరపుకోట: మండలంలో విశాఖ – అరుకు రోడ్డులో గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో రాజీపేట గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మారుతీ వ్యాన్ ప్రమాదానికి గురైంది. బొడ్డవర నుంచి ఎస్.కోట వైపు వస్తున్న మారుతీ వ్యాన్‌లో ఏడుగురు ప్రయాణికులు ఉన్నారు. వ్యాన్ ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కనున్న పంట కాలువలోకి దూసుకుపోయింది. కాగా వాహనంలో ఉన్న వారికి, రోడ్డుపై ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల సహాయంతో వ్యాన్ బయటికి తీశారు.

పరిశుభ్రతే ప్రధానం

పార్వతీపురం: పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని, ప్రతీ గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులతో గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మలేరియా కేసులు నమోదైతే వైద్యాధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాలను శుక్రవారం విస్తృతంగా నిర్వహించాలన్నారు. ప్రత్యేకాధికారులు పారిశుద్ధ్య నిర్వహణను, పాఠశాలలోని విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించాలని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ మాట్లాడుతూ ఇంతవరకు 340 గ్రామ పంచాయతీల్లోను, 951 గ్రామాల్లోను పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. తాగునీటి పథకాలను శుభ్రపరచడం, క్లోరినేషన్ చేయడం జరుగుతుందన్నారు. నీటి నిల్వలు ఉండే ప్రదేశాలను గుర్తించి పారిశుద్ధ్య నిర్వహణ చేయాల్సివుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఓ.ప్రభాకర్‌రావు, జిల్లా ప్రణాళిక అధికారి పి. వీర్రాజు తదితరులున్నారు.

గ్రామ సందర్శనలో సమస్యలు ఏకరువు

బొండపల్లి: గ్రామ సందర్శనలో భాగంగా అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. బొండపల్లి మండలం ముద్దూరు గ్రామాన్ని గురువారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాహార పంపిణీపై ఆరా తీశారు. చాలామంది పిల్లలు బరువు తక్కువగా ఉన్నారని, లోపాన్ని అధిగమించేలా పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. గ్రామంలోని రెల్లిపేట కాలనీ వాసులు కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని విన్నవించగా, రెండు రోజుల్లోగా సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూస్ ఏఈఈ సునీల్‌ను కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలోని ఆరోగ్య కేంద్రాన్ని ఆగస్టు 10వ తేదీలోగా పూర్తిచేయాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎన్‌వీకే దుర్గాప్రసాద్, ఎంపీడీఓ ఎస్.హరిహరరావు, తహసీల్దార్ హనుమంతురావు, సర్పంచ్, ఎంపీటీసీ మునకాల పైడినాయుడు, సుంకరి కృష్ణవేణి, నాయకులు కళ్యాణపు నారాయణరావు, ఎస్.సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.